సాక్షి
కామారెడ్డి
శనివారం ၊ 12 ၊ ఏప్రిల్ ၊ 2025



హనుమాన్ జయంతికి..

జిల్లాలో శనివారం హనుమాన్ జయంతిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు.

- 10లో ▸



బీజేపీ జెండా ఎగరడం ఖాయం

బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాలలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాలు నిర్వహించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
39.6 /20.0

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్క పోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలి



దోమకొండ : న్యాయ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి నాగరాణి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గడికోట ట్రస్టు, తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల వేసవికాల ప్రత్యేక శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. న్యాయం ఉచితంగా దొరుకుతుంది అనే అంశాన్ని వివరించారు. న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, సౌత్ క్యాంపస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు పట్టుపరిశ్రమపై అవగాహన సదస్సు

బీబీపేట: యాడారం గ్రామ రైతు వేదికలో శనివారం పట్టు పరిశ్రమపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టు పరిశ్రమను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ ద్వారా వాణిజ్య పంటల కంటే అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. పట్టుపరిశ్రమపై ఆసక్తి ఉన్న రైతులు అవగాహన సదస్సులో పాల్గొనాలని కోరారు.

ఐఫోన్ వినియోగదారుల కోసం టీజీఎన్పీడీసీఎల్ యాప్

కామారెడ్డి అర్బన్ : ఐ ఫోన్ వినియోగదారుల కోసం టీజీఎన్పీడీసీఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యాప్‌లో సంఘటనల రిపోర్టు, ఫిర్యాదులు, సెల్ఫ్ రీడింగ్, బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్లు ఎలా తీసుకోవాలి, పేరు, లోడ్ మార్పు, బిల్లుల సమాచారం, విద్యుత్ అధికారి వివరాలు, విద్యుత్ వినియోగదారుల సమాచారం ఉంటాయని పేర్కొన్నారు. ఐఫోన్ వినియోగిస్తున్న ఎన్పీడీసీఎల్ కస్టమర్లు ఈ యాప్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మద్నూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో శుక్రవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రంలోనే పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శీను పటేల్, సలాబత్‌పూర్ ఆలయ కమిటీ చైర్మన్ రాంపటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, సొసైటీ కార్యదర్శి బాబూరావ్, నాయకులు హన్మండ్లు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు ‘వక్ఫ్ సవరణ’కు వ్యతిరేకంగా నిరసన



బాన్సువాడ రూరల్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం రాష్ట్ర రాజధానిలో నిరసన తెలపనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాలెక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బాన్సువాడలో విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ముస్లిం సమాజంపై దాడిగా అభివర్ణించారు. దీనిని నిరసిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్దగల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి ముస్లింలు, ఇతర మైనారిటీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేబ్, ఖమ్రొద్దీన్, రైస్, మన్నాన్, ముఖీద్, గౌస్ పాషా, ఇలియాస్, సలీమ్, అతీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మొరం అక్రమదందాతో రెండు చేతులా సంపాదించడానికి కొందరు నాయకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో అధికారులు అడ్డుతగలడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. తాము చెప్పినట్లు వినాలంటూ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. మాట వినకపోతే ఏదో రకంగా ఇబ్బంది పెట్టడానికి యత్నిస్తుండడంతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడానికి తహసీల్దార్లు జంకుతున్నారు.



తహసీల్దార్లకు తలనొప్పి!

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక, మొరం దందా
- అటువైపు చూడొద్దంటూ అధికార పార్టీ నేతల హుకూం
- వాహనాలను సీజ్ చేయాలంటే జంకుతున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఇసుక, మొరం అక్రమ దందా తహసీల్దార్లకు తలనొప్పి వ్యవహారంగా మారింది. అభివృద్ధి పనుల పేరుతో అక్రమంగా ఇసుక తరలించే విషయంలో కొన్నిచోట్ల ఫిర్యాదులు వస్తుండడంతో అధికారులు స్పందించాల్సి వస్తోంది. అయితే ‘మాకే అడ్డు తగులుతారా’ అంటూ కొందరు నాయకులు అధికారులపై జులుం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తాము నడుచుకుంటామని అధికారులు వారికి నచ్చజెప్పుతున్నా వినిపించుకోవడం లేదు. అక్రమ దందాకు సహకరించలేదని ఓ తహసీల్దార్‌ను అధికార పార్టీకి చెందిన కొందరు ఇబ్బందులకు గురిచేసిన విషయం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తున్న వారిని అడ్డుకుని వాహనాలను సీజ్ చేయాలంటే అధికారులు జంకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాగా గతంలో అదే మంజీర నదిలో పదేళ్లు ఏం జరిగినా అధికారులు అటువైపు చూడలేదని, ఇప్పుడు తమను ఎలా అడ్డుకుంటారంటూ కొందరు బాహాటంగా విరుచుకుపడుతుండడం విస్మయం కలిగిస్తోంది. కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా పరిస్థితి తయారయ్యిందని పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంజీరను చెరబట్టారు

జిల్లాలో విస్తారంగా ప్రవహించే మంజీర నది నుంచి అభివృద్ధి పనుల పేరుతో కొందరు ఇసుక దందాకు తెరలేపారు. నది పొడవునా పెద్ద ఎత్తున ఇసుక ఉంది. ఇసుక దందాలో ఆరితేరిన పలువురు.. అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు పొంది అక్రమంగా తరలిస్తున్నారు. మంజీర నది నుంచి ఇసుకను కామారెడ్డితోపాటు నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకూ అక్రమంగా తరలిస్తున్నారు. స్థానిక అవసరాలకు అనుమతులు పొంది, మంజీర నుంచి ఇసుకను తోడేస్తున్న ఇసుకాసురులు.. ఒక చోట డంప్ చేసి, రాత్రి వేళల్లో టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తుండడంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేస్తున్నారు. ఇది ఇసుక దందా సాగిస్తున్న వారికి మింగుడుపడడం లేదు. అధికారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు వచ్చినా సరే అటువైపు కన్నెత్తి చూడొద్దంటూ హుకూం జారీ చేస్తుండడంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే అడ్డుకోవాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయని అధికారులు చెబుతున్నా వినడం లేదు. తాము చెప్పినట్టు వినాల్సిందేనని అధికారులతో పేర్కొంటున్నారు. ఇటీవల మంజీర పరీవాహక ప్రాంతంలో పలువురు తహసీల్దార్ల బదిలీకి ఇసుక లొల్లే కారణమని తెలుస్తోంది.

యథేచ్ఛగా మట్టి తరలింపు

జిల్లాలో ఇసుకతో పాటు మట్టి, మొరం దందా యథేచ్ఛగా నడుస్తోంది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే పొక్లెయిన్లతో మట్టి, మొరం తవ్వి తరలిస్తున్నారు. దీనిపై ప్రజలు అధికారులకు సమాచారమిస్తే అధికారులు విచారణ జరుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతుంటే తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు వెళ్లి కేసులు నమోదు చేస్తున్నారు. దీన్ని అక్రమార్కులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు అడ్డు తగలొద్దంటూ అధికారులను హెచ్చరిస్తున్నట్లు తెలిసింది.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/మద్నూర్ : ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. శుక్రవారం డోంగ్లీ నుంచి బీర్కూర్‌కు వస్తుండగా కుర్లా సమీపంలో మంజీర బ్రిడ్జి వద్ద ట్రాక్టర్లలో ఇసుకను నింపుతుండడాన్ని ఆమె గమనించారు. వెంటనే రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చి ట్రాక్టర్లను పట్టుకునే ప్రయత్నం చేశారు. సబ్ కలెక్టర్‌ను గమనించిన ట్రాక్టర్ యజమానులు అక్కడి నుంచి పారిపోయారు. ఇసుక అక్రమ రవాణా కోసం ఏర్పాటు చేసిన దారిని పొక్లెయిన్ సహాయంతో తొలగింపజేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని అధికారులకు సూచించారు.



కుర్లా సమీపంలో మంజీర బ్రిడ్జి వద్ద అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



పంట నూర్పిడి అనంతరం వడ్లను ట్రాక్టర్‌లో నింపుతున్న హార్వెస్టర్

దిగుబడి అంతంతే!

- తెగుళ్లతో దెబ్బతిన్న పంట
- నిరాశలో వరి రైతు

నాగిరెడ్డిపేట : యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. అయితే ఈసారి తక్కువ దిగుబడులు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో యాసంగి సీజన్‌లో 2.61 లక్షల ఎకరాలలో వరి సాగయ్యింది. అయితే జిల్లాలోని పలు ప్రాంతాలలో పంటను చీడపీడలు ఆశించాయి. వాటి నివారణకు రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. అయినా పంట దెబ్బతినడంతో దిగుబడులు తక్కువగా వస్తున్నాయి. పంటను మొగి పురుగు, మెడవిరుపు తెగులు ఆశించాయని రైతులు పేర్కొంటున్నారు. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో సాగు చేసిన వరినుంచి 28 నుంచి 32 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. కానీ ఈ సారి 12నుంచి 15 క్వింటాళ్లు కూడా రావడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. తెగుళ్లతో గింజ పొల్లుగా మారిందని, వచ్చిన దిగుబడులతో కనీసం పెట్టుబడుల ఖర్చులూ తిరిగి వచ్చేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు ట్రాక్టర్ల వడ్లే..



మూడెకరాల భూమిలో వరి వేశాను. వారం క్రితం పంటను కోయగా మూడు ట్రాక్టర్ల వడ్లే వచ్చాయి. అంటే ఎకరానికి 12 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. గతేడాది యాసంగిలో ఎకరాకు 26 క్వింటాళ్ల వరకు పండాయి. ఈసారి తెగుళ్లతో నష్టపోయా.

– సతీష్‌గౌడ్, రైతు, లింగంపల్లి కలాన్

పెట్టుబడి మీదపడ్డట్లే..



ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని వరి వేశా. పంటను మొగిపురుగు, మెడవిరుపు తెగులు ఆశించాయి. వీటి నివారణ కోసం వేల రూపాయల మందులు స్ప్రే చేశాను. ప్రస్తుతం పంటను కోయగా ఎకరాకు 10 క్వింటాళ్ల వడ్లే వచ్చాయి. ఈసారి పెట్టుబడులు మీదపడ్డట్లే.

– సాయిలు, రైతు, లింగంపల్లికలాన్

జీజీహెచ్‌కు సీటీ స్కానింగ్ సెంటర్ మంజూరు



మంత్రి దామోదర రాజనర్సింహ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సీటీ స్కానింగ్ సెంటర్ మంజూరైందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జీజీహెచ్ సమస్యలపై మంత్రితో చర్చించానని షబ్బీర్ అలీ తెలిపారు. జీజీహెచ్‌కు సీటీ స్కానింగ్ సౌకర్యం లేదని చెప్పగానే రూ. 2.50 కోట్లతో సీటీ స్కానింగ్ సెంటర్‌ను మంజూరు చేశారన్నారు. జీజీహెచ్‌కు సీటీ స్కానింగ్ సెంటర్, దోమకొండ సీహెచ్‌సీ అప్‌గ్రేడేషన్ ఉత్తర్వులను షబ్బీర్ అలీకి మంత్రి అందించారు. సమావేశంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఫరీదా, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి’

కామారెడ్డి క్రైం: పట్టణంలో శనివారం జరిగే వీర హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. శుక్రవారం ఆయన వీహెచ్‌పీ నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలో శోభాయాత్ర జరిగే ప్రాంతాలను పరిశీలించారు. కోదూరి హనుమాన్ ఆలయం నుంచి బడా మజీద్, రైల్వే బ్రిడ్జి, నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్ రోడ్, ధర్మశాల, సుభాష్ రోడ్, వీక్లీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హనుమాన్ జయంతి ర్యాలీని పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్, విద్యుత్, పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, ప్రతినిధులు గోపాలకృష్ణ, బొల్లి రాజు, బజరంగ్ దళ్ ప్రతినిధులు వివేకానంద, అశోక్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్ర జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, నాయకులు

దుమ్ములేపుతున్న పనులు

- వాటరింగ్‌ను పట్టించుకోని కాంట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ఎల్లారెడ్డిరూరల్ : మెదక్– రుద్రూర్ 765డీ జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. అయితే పనులను అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు జరుగుతున్న సమయంతో పాటు, కల్వర్టులు నిర్మిస్తున్న ప్రాంతంలో దారి మళ్లిస్తున్నారు. మట్టి రోడ్డు మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఎండాకాలం కావడంతో మట్టి పొడిబారి ఉంది. దీంతో వాహనాలు వెళ్లే సమయంలో విపరీతంగా దుమ్ము లేస్తుండడంతో వాహనదారులు ప్రధానంగా బైక్‌లపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఈ మార్గంలో వెళ్లేవారు అనారోగ్యానికి గురవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలలో వాటరింగ్ చేయించి, దుమ్ము లేవకుండా చూడాలని కోరుతున్నారు.



మల్లయ్యపల్లి శివారులో దుమ్ములో ప్రయాణిస్తున్న వాహనదారులు

అధికారులు పర్యవేక్షించాలి



కల్వర్టుతో పాటు ఇతర ప్రాంతాలలో మట్టి రోడ్డుపై నుంచి వెళ్తున్న సమయంలో దుమ్ములేస్తోంది. దీంతో కళ్లలో దుమ్ముపడుతోంది. అధికారులు పనులను పర్యవేక్షించి, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలి.

– మోహన్, వాహనదారుడు, వడ్డేపల్లి

నీళ్లు పట్టించాలి



పనులు జరుగుతున్న ప్రాంతాలలో దుమ్ము బాగా లేస్తోంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పనులు జరుగు తున్న ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించాలి. దుమ్ము లేవకుండా నీళ్లు పట్టించాలి.

– సాయిలు, వాహనదారుడు, ఎల్లారెడ్డి

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- ఏడుగురు సభ్యుల మహారాష్ట్రకు చెందిన పార్థి గ్యాంగ్
- జాతీయ రహదారిపై దారిదోపిడీలు
- అవసరమైతే కత్తులతో దాడులు
- నిలిపిన వాహనాలు వీరి టార్గెట్
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర



పార్థి ముఠా దొంగతనానికి ఉపయోగించిన కత్తులు, రాళ్లు, కర్రలు, సెల్‌ఫోన్‌లు

కామారెడ్డి క్రైం : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని జాతీయ రహదారి 44 వెంబడి ఆగి ఉన్న వాహనాలను టార్గెట్ చేస్తూ దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా (పార్థి గ్యాంగ్)ను కామారెడ్డి పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. నెల రోజుల వ్యవధిలో కామారెడ్డి జిల్లా లోని సదాశివనగర్, దేవునిపల్లి పీఎస్‌ల పరిధిలో రెండు దారి దోపిడీ ఘటనలు వెలుగు చూశాయి. వాటిలో ఒకటి ఈ నెల 2 న టేక్రియాల్ వద్ద జరిగింది. ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి తన కుమారుడిని హైదరాబాద్‌లోని హాస్టల్ నుంచి కారులో ఇంటికి తీసుకుని వస్తూ తెల్లవారు జామున టేక్రి యాల్ సమీపంలోని దాబా వద్ద రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్నారు. గమనించిన దుండగులు కారు అద్దాలు పగులగొట్టి కత్తులతో బెదిరించి ల్యాప్‌టాప్, మరో బ్యాగును ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి విచారణ జరుపగా ఇలాంటి ఘటనలు ఎన్‌హెచ్–44 వెంబడి తరచుగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నిందితులను పట్టుకునేందుకు ఆరు ప్రత్యేక బృందాలతో విచారణ ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు.

పంక్చర్ షాప్ యజమాని ఇచ్చిన క్లూతో..

పంక్చర్ షాప్ యజమాని ఇచ్చిన క్లూతో నిందితులను గుర్తించడం సాధ్యమయిందని ఎస్పీ తెలిపారు. టేక్రియాల్ వద్ద దుకాణం నడుపుతున్న షకీల్ పోలీసులకు ఏడాది క్రితం జరిగిన ఓ దారి దోపిడీ ఘటనను వివరించి బాధితుడి అడ్రస్ ఇచ్చాడని, అతని ద్వారా నిందితుల ఆనవాళ్లు తెలుసుకున్నామని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలతో నిందితులు మెదక్ జిల్లాలోని చేగుంట వద్ద ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నట్లు వెల్లడించారు. నలుగురు పరారీలో ఉండగా ఈ కేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయాలపై విచారణ కొనసాగిస్తామని ఎస్పీ వివరించారు. పంక్చర్ షాప్ యజమాని షకీల్‌ను అభినందించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐలు శ్రీనివాస్, రామన్, సంతోష్ కుమార్, ఎస్సైలు రాజు, రంజిత్, ఉస్మాన్, సిబ్బంది రవి కిరణ్, రవిలను ఎస్పీ అభినందించారు.



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

బెలూన్లు అమ్ముకునేవారిలా..

మహారాష్ట్రలోని వార్ధా జిల్లాకు చెందిన కులీ కిషన్ పవార్, జాకీ గుజ్జు భోంస్లే, హరీష్ పవార్, అతని భార్య హౌరా పవార్, అనురాగ్ రత్నప్ప భోంస్లే, అతని భార్య అంచనా భోంస్లే, చూడీలను ప్రస్తుతం పోలీసులు అరెస్ట్ చేశారు. చిరంజీవి, గుండా, సాంబ భోంస్లే, బంగారు భోంస్లేలు పరారీలో ఉన్నారు. వీరంతా వార్ధా జిల్లాలోని ఓలాంనగర్, సముద్రాపూర్, శివగ్రాం గ్రామాలకు చెందిన వారు. వారంతా ముఠాగా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. జాతీయ రహదారి వెంబడి రోడ్డుకు దగ్గరగా నీలి రంగు గుడారాలు వేసుకుని నివసిస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు బెలూన్‌లు, పూసలు, చిన్న చిన్న వస్తువులు, బొమ్మలు అమ్ముకునే వారిగా నటిస్తూ కాలనీల్లో, రోడ్ల వెంబడి తిరుగుతుంటారు. ఎక్కడ చోరీకి అవకాశం ఉంటే అక్కడ చోరీ చేసేందుకు, అడ్డు వస్తే కత్తులతో దాడి చేసేందుకు సైతం వెనుకాడరని ఎస్పీ తెలిపారు. ప్రధానంగా రోడ్డు పక్కన వాహనాలు నిలిపి విశ్రాంతి తీసుకునే వారిని టార్గెట్ చేస్తారు. వాహనాల అద్దాలు పగులగొట్టి, అవసరమైతే కత్తులతో బెదిరించి నగదు, బంగారం, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటివి జిల్లాలోని గాంధారి, సదాశివనగర్ పీఎస్‌ల పరిధిలో ఒకటి చొప్పున, దేవునిపల్లి పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయి. ఇవే కాకుండా నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి, ఆర్మూర్, ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర పీఎస్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. జాతీయ రహదారుల వెంబడి రోడ్ల పక్కన నిలిపే వాహనాల్లో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందినవి ఉంటాయి. తక్కువ మొత్తంలో సొత్తు కోల్పోయిన వారు ఇక్కడి పీఎస్‌లలో కేసులు పెట్టడానికి ముందుకు రారు కాబట్టి పోలీస్ స్టేషన్‌ల వరకు రాని దోపిడీలను ఈ గ్యాంగ్ మరెన్నో చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని ఎస్పీ తెలిపారు.

కలిసికట్టుగా పోరాటం

- విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థుల డిమాండ్
- కలిసికట్టుగా పోరాడేందుకు త్వరలో కార్యాచరణ
- 'సాక్షి' చర్చాగోష్టిలో ముక్తకంఠంతో వెల్లడి

సాక్షి చర్చాగోష్టి

తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయాల్సిందే



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్టిలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

తెయూ(డిచ్‌పల్లి)/నిజామాబాద్ అర్బన్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాల్సిందేనని విద్యార్థి సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్టిలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, వర్సిటీ పూర్వ విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందే ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి యూనివర్సిటీ సాధించుకున్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, విద్యార్థుల మనోభావాలను గుర్తించి దివంగత సీఎం, మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రం పేరుతో తెలంగాణ యూనివర్సిటీ మంజూరు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలోనే ఓయూ, కేయూ తర్వాత మూడో అతిపెద్ద యూనివర్సిటీ తెయూ అని, 577 ఎకరాల సువిశాల ప్రాంగణం వర్సిటీ సొంతమన్నారు. తెయూ ఏర్పడి 18ఏళ్లు గడిచినా జిల్లా ప్రజాప్రతినిధుల అసమర్థతతోనే ఇంతవరకు ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కాలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రతిసారి ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు అంశాన్ని ఓట్ల కోసం రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని అన్నారు. వర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేసే వరకు విద్యార్థి సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి కలసికట్టుగా పోరాడాలని, అందుకోసం త్వరలోనే కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు.

జిల్లా ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదు..



ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు విషయమై జిల్లా ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదు. చిన్నచిన్న జిల్లాలకు ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. వసతి, సౌకర్యాలపరంగా అన్ని విధాలా అనుకూలంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఇంజినీరింగ్ కాలేజీ లేకపోవడం దురదృష్టకరం. ఇంజినీరింగ్ కాలేజ్ ఏర్పాటుపై అసెంబ్లీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ఒక్కరే మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ మాట్లాడిన పాపాన పోలేదు.

– పిల్లి శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు

సాక్షి చర్చాగోష్టితోనే నాంది పలకాలి



తెలంగాణ వర్సిటీలో జరిగే అవినీతి, అక్రమాలను వెలికితీయడంలో 'సాక్షి' కృషి అభినందనీయం. బీఆర్ఎస్ హయాంలోనే జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. కళాశాల మంజూరు ఉత్తర్వులు వచ్చే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాపై వివక్ష చూపుతోంది. గతంలో పార్టీలకతీతంగా వర్సిటీ ఏర్పాటు కోసం ఎలా అయితే పోరాడామో, ఇప్పుడు తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటయ్యేంత వరకు కలిసికట్టుగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకు 'సాక్షి' చర్చాగోష్టితోనే నాంది పలకాలి.

– శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం సుముఖంగా ఉంది..



తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఇటీవలే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డిని కలువగా ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

– పంచరెడ్డి చరణ్, తెయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు

కలిసికట్టుగా పోరాడాలి



తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటయ్యేంతవరకు అన్ని విద్యార్థి సంఘాలు జేఏసీగా ఏర్పడి కలిసికట్టుగా పోరాడాలి. తెయూ అధికారులకు అక్రమాలపై ఉన్న శ్రద్ధ వర్సిటీ భూములను కాపాడుకోవడంపై లేదు. ఇప్పటికే వర్సిటీకి సంబంధించి 57 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయింది. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వర్సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి వర్సిటీలో ఇంజినీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయించాలి.

– యెండల ప్రదీప్, తెయూ పూర్వ విద్యార్థి

పోరాటానికి సహకరిస్తాం..



ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిపే పోరాటాలకు పూర్వ విద్యార్థులుగా మావంతు సహకారం అందజేస్తాం. విద్యార్థుల చేతుల్లోనే వర్సిటీ భవిష్యత్ ఆధారపడి ఉంది. ఇంజినీరింగ్ కాలేజీ వస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి వస్తుంది. కాలేజీ ఏర్పాటుకు అవసరమైన సువిశాల స్థలం, ఫ్యాకల్టీ ఇప్పటికే అందుబాటులో ఉన్నారు.

– పుప్పాల రవి, తెయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

తలరాత మారడం లేదు..



ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ విద్యార్థుల తలరాత మారడం లేదు. ప్రైవేట్ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీలకు విచ్చలవిడి అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం.. ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుపై చిత్తశుద్ధి చూపడం లేదు. తెయూలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుకు 'సాక్షి' తీసుకుంటున్న చొరవ అభినందనీయం.

– ప్రిన్స్, పీడీఎస్‌యూ నగర కార్యదర్శి

హనుమాన్ జయంతికి ఆలయాలు ముస్తాబు



సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో ఏర్పాట్లు



సుల్తాన్‌నగర్‌లో పెయింట్ వేస్తున్న సిబ్బంది



సరంపల్లిలో కొలువు దీరిన ఆంజనేయ స్వామి

మద్నూర్/కామారెడ్డి రూరల్/బాన్సువాడ రూరల్/సదాశివనగర్/బీబీపేట/నిజాంసాగర్ : జిల్లా వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆలయాలను ముస్తాబు చేశారు. పలు గ్రామాల్లో ఆలయాలను కొత్త రంగులతో తీర్చిదిద్దారు.మద్నూర్ మండలం సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాంపటేల్ తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు.

హనుమాన్ యాత్రను విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

కామారెడ్డి టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఆధ్వర్యంలో జరిపే వీర హనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం తెలిపారు. శుక్రవారం స్థానిక ధర్మశాలలో వారు మాట్లాడారు. పట్టణంలోని కోదూరి హనుమాన్ ఆలయ నుంచి ఈ యాత్ర ప్రారంభం అవుతుందని పుర వీధుల గుండా ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. హనుమాన్‌దీక్ష స్వాములు, భక్తులు,యువకులు, హిందువులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ సంపర్క్, గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి బోల్లి రాజు, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ అశోక్, పట్టణ అధ్యక్షుడు వడ్ల వెంకట స్వామి, కార్యదర్శి వంగ ప్రసాద్, జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్ రావ్, విశ్వం గుప్తా, పాపారావు, మంచాల రాజు, భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీ జన సమీకరణ

- కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



మాట్లాడుతున్న గంప గోవర్ధన్

భిక్కనూరు: హనుమకొండలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ వేడుకలకు భారీ జన సమీకరణ చేయనున్నట్లు కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ చెప్పారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామము నుంచి పార్టీ శ్రేణులతో పాటు అభిమానులను పెద్ద ఎత్తున తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వాహనాలను సమకూర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు మల్లేశం, సిద్దిరామేశ్వర ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ యాదగిరి, రామేశ్వరపల్లి అంతంపల్లి సొసైటీ అధ్యక్షులు నాగర్తి భూమి రెడ్డి, తదితరులున్నారు.

వచనాలయ అభివృద్ధికి సహకరించాలి



నిజామాబాద్ అర్బన్: నగరంలోని బాపూజీ వచనాలయం అభివృద్ధికి సహకరించాలని వచనాలయం కమిటీ ప్రతినిధులు కోరారు. బాపూజీ వచనాలయం కమిటీలో నూతనంగా సలహాదారులు, కోఆప్షన్ సభ్యుల నియామకం చేపట్టగా శుక్రవారం వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడు భక్తవత్సలం మాట్లాడుతూ.. బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ మాధ్యమంలోకి తీసుకెళ్లే ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఇకపై పుస్తకాలతో పాటు డిజిటల్ చదువుకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. ఇందుకోసం సభ్యులు, సలహాదారులు, కోప్షన్ సభ్యులు ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు. అనంతరం నూతన సలహాదారులు తాహెర్ బిన్ హందన్, గడుగు గంగాధర్, కేశవేణు, శేఖర్ గౌడ్, దినేష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, ధర్మపురి సురేందర్, కోప్షన్ సభ్యులుగా బంటు రాజేశ్వర్, మాస్టర్ శంకర్, శ్రీహరి ఆచార్య, మెగా సుబేదర్, సాయిబాబా గౌడ్‌ను సన్మానించారు. ప్రధాన కార్యదర్శి మీసాల సుధాకర్, కోశాధికారి గంగాధర్‌రావు, ఉపాధ్యక్షుడు దాస్, సంయుక్త కార్యదర్శి సాంబయ్య, దత్తాత్రి, సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని బలహీన పర్చే కుట్రలను తిప్పికొడదాం



తాడ్కోల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని, దాన్ని మౌలిక సూత్రాలను బలహీన పర్చేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొడదామని యువజన కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాడ్కోల్ గ్రామంలో నిర్వహించిన జైబాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అణగారిన వర్గాలకు బీజేపీ అన్యాయం చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా యువకులు, ప్రజలు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బలహీన వర్గాల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. గ్రామంలో అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలు, రాజ్యాంగాన్ని చేతబూని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో నాయకులు కాసుల రోహిత్, బుడిమి సహకార సంఘం చైర్మన్ గంగుల గంగారాం, కుమ్మరి రాజు, లక్ష్మాగౌడ్, విఠల్‌రెడ్డి, గోపి, జగన్, దర్జి హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

నిజాంసాగర్/తాడ్వాయి: నిజాంసాగర్ మండలం సుల్తాన్ నగర్ గ్రామంలో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. గ్రామంలోని విధుల్లో తిరుగుతూ జై భీం, జై బాపు, జై సంవిధాన్ నినాదాలతో ర్యాలీ తీశారు. తాడ్వాయి మండలం చిట్యాల, సంతాయిపేట్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీవో మల్హారి సూచించారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషకార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి లబ్ధిదారుల గుర్తింపు, ఉపాధి కూలీల పెంపు వేగవంతం చేయాలని సూచించారు.

ఉచిత మంచినీటి సరఫరా

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని 35వ వార్డులో మంచినీటి ఎద్దడి ఉందని కాలనీవాసులు దేవునిపల్లి మాజీ సర్పంచ్ నిట్టు వెంకట్ రావు దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన వెంకట్ రావు కాలనీవాసుల దాహార్తి తీర్చడానికి శుక్రవారం ఉచిత మంచినీటి ట్యాంకర్ ను ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తాం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రావణ్‌కుమార్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామని ఎస్ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఆయా గ్రామాల్లో నూతనంగా వేస్తున్న పోల్స్‌ను పరిశీలించారు. శెట్పల్లిసంగారెడ్డి, బొల్లారం 33 కేవీ మధ్య నిరుపయోగంగా ఉన్న 6కేవీ, 33 కేవీ లైను ఉపయోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీంతో 5 సబ్ స్టేషన్లు బొల్లారం, భిక్కనూరు, శెట్పల్లిసంగారెడ్డి, పర్మళ్ల, కన్నాపూర్ గ్రామాల మధ్య ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వేరే సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం 15 అదనపు పోల్స్ వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ విజయ్‌సారథి, ఏడీ మల్లేశం, ఏఈ హరీష్‌రావు, లైన్ ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబెట్టిన వారిపై చర్యలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రోడ్లపై ధాన్యం ఆరబెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేందర్ రైతులకు తెలియజేశారు.శుక్రవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలను పరిశీలించి వాటిని వెంటనే తొలగించాలని ఎస్సై మహేందర్ రైతులకు సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మోరే రాజు(43)జనవరిలో తన పొలంలో రెండు బోర్లు వేయగా ఒక బోరులో మాత్రమే కొద్దిమేర నీరు వచ్చింది. బోరులో వచ్చిన నీరు సైతం యాసంగిలో పంటకు సరిపడక కొంతమేర పొలం సైతం ఎండిపోయింది. దీంతో బోర్లు వేసేందుకు తెచ్చిన అప్పులతోపాటు పంట పెట్టుబడికి అప్పులు తెచ్చాడు. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో గురువారం రాత్రి తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బోధన్ మండలంలో..

బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. పోతంగల్ మండలంలోని కారేగాం గ్రామానికి చెందిన ప్రేమలతకు కొన్నేళ్ల క్రితం పెగడపల్లికి చెందిన సాయిలుతో వివాహమైంది. కొంతకాలంగా ఆమెను బావ దేవయ్య, తోటి కోడలు పద్మ, మామ గంగారాం వేధింపులకు గురిచేస్తుండేవారు. గురువారం సాయంత్రం వేధింపులు భరించలేక ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూలే జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి మాంధాత సీతారామమూర్తి

తెయూ(డిచ్‌పల్లి): నేటి యువత మహాత్మా జ్యోతి బాపూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి కృషి చేయాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి మాంధాత సీతారామమూర్తి పిలుపునిచ్చారు. తెలంగాణ యూనివర్సిటీలో శుక్రవారం జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా తెయూ బీసీ సెల్ డైరెక్టర్ సీహెచ్ ఆరతి అధ్యక్షతన 'భారతదేశ సామాజిక సమ్మిళిత అభివృద్ధిలో పూలే పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పూలే 1873లో సత్యశోధక్ సమాజ్ స్థాపించి సమానత్వ సమాజం కోసం పోరాడారన్నారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చరిత్రను చదవడం కాదు.. చరిత్రను సృష్టించాలన్నారు. రిసోర్స్ పర్సన్ సీహెచ్ ఆంజనేయులు మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళల విద్యకు అడ్డంకులను తొలగించడానికి పోరాడిన మహనీయుడన్నారు. పీఆర్‌వో పున్నయ్య, ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, అధ్యాపకులు స్వప్న, నీలిమ ప్రసంగించారు. అనంతరం సీతారామమూర్తిని, రిజిస్ట్రార్ యాదగిరి, సదస్సు నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

రెంజల్(బోధన్): మండలంలోని రౌడీషీటర్లకు శుక్రవారం రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై చంద్రమోహన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రౌడీషీట్ ఉన్న ప్రతీ ఒక్కరిపై నిఘా ఉంటుందన్నారు. మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. తీరు మారని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉంటే ఎత్తివేసే ఆలోచన పోలీస్ కమిషనర్ చేస్తున్నారని వివరించారు. మండలంలోని 8 మంది రౌడీషీటర్ల నేరచరిత్ర, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి కేసులకు పోకుండా జీవనోపాధి అవకాశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

మద్నూర్‌లో దుండగుడి హల్‌చల్

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ఓ గుర్తుతెలియని దుండగుడు హల్‌చల్ చేశాడు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. గాంధీచౌక్ ప్రధాన రహదారిపైగల తమ్మెవార్ రాజుసేట్ తన ఇంట్లో కుటుంబ సభ్యులతో రాత్రి పడుకున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో దుండగుడు ఇంటి వెనక నుంచి ఇంట్లోకి ప్రవేశించారు. కుటుంబసభ్యులు అతడిని గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. దుండగుడు వెంట తెచ్చుకున్న కారంపొడి, కమ్మకత్తి, గడ్డపార, కత్తిని వదిలిపెట్టి పారిపోయినట్లు వారు అన్నారు. దుండగుడు ఇంటి చుట్టుపక్కల ఇళ్లకు బయట నుంచి గడియ పెట్టి వెళ్లిపోయాడు. దీంతో ఆయా ఇళ్లలోని వారు ఉదయం సన్నిహితులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఇళ్లకు గడియలను తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేసి దుండగుడిని పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని బీటీ నగర్ కాలనీలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహకుడు షేక్ సయీద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. బీటీనగర్ కాలనీలో సయీద్ అనే యువకుడు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్న సమాచారం రావడంతో పోలీసులు అతడి ఇంటిపై దాడి చేశారు. సయీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నిజామాబాద్‌కు చెందిన ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకులు ముజీబ్, సచిన్‌లను పరిచయం చేసుకొని బోధన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించ వచ్చని యువతకు మాయ మాటలు చెప్పి వారితో ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేసి క్రికెట్ బెట్టింగ్ ఆడించేవాడన్నారు. అలా వచ్చిన డబ్బును ముజీబ్‌కు ఇవ్వగా, అతడు కమీషన్ ఇచ్చేవాడన్నారు. బెట్టింగ్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి సెల్ ఫోన్, బ్యాంక్ పాస్‌బుక్ సీజ్ చేశామని, కేసునమోదు చేసి రిమాండ్ తరలించినట్లు వెల్లడించారు.

కామారెడ్డిలో అగ్ని ప్రమాదం



కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో అద్దెకు ఉన్న మతిన్ కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసింది. ఇంట్లోని సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



పెర్కిట్(ఆర్మూర్): అనేక సంవత్సరాలుగా గల్ఫ్ కార్మికులు ఎదురు చూస్తున్న ఎన్ఆర్ఐ పాలసీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సలహా కమిటీ ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహ నాయుడు అన్నారు. మామిడిపల్లిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన సలహా కమిటీలో గల్ఫ్ కార్మికుల కష్టాలు తెలిసిన నిపుణులను చేర్చుకుంటే బాగుండేదన్నారు. అలాగే గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. న్యాయ సలహాదారుడు బాలయ్య పాల్గొన్నారు.